క్లుప్తంగా

పీఈటీలను నియమించాలని వినతి



అడ్డాకుల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు చొరవ చూపాలని గురువారం హైదరాబాద్‌లో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. యూపీఎస్‌లలో కూడా పీఈటీలను నియమించలేదని, భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట భీంరెడ్డి తదితరులు ఉన్నారు.

384 పశువులకు టీకాలు



భూత్పూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్త మొల్గర, అన్నాసాగర్‌లో గురువారం 384 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డా. మధుసూదన్ తెలిపారు. ఇందులో 100 ఆవులు, 284 గేదెలు ఉన్నాయని.. యజమానులు వ్యాధులు రాకుండా ముందుస్తుగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని, గ్రామాలకు వచ్చే పశువైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. పశువైద్య సిబ్బంది కృష్ణయ్య, శోభారాణి, గోపాలమిత్ర చెన్నయ్య పాల్గొన్నారు.

సీసీ రహదారి పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఒకటో డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరకాలనీలో కొనసాగుతున్న సీసీ రహదారి పనులను గురువారం పుర మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



దేవరకద్ర రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న కథనం మేరకు.. పట్టణ శివారులోని పెట్రోల్‌బంక్ వద్ద గాయాలతో పడి ఉన్న ఓ వ్యక్తిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, పేరు మాత్రం శ్రీను అని చెబుతున్నారని, మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 87126 59349కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కు చెందిన కమ్మరి ఆచారి అనారోగ్యంతో మృతిచెందడంతో గురువారం బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేశ్ పరామర్శించారు. అదేవిధంగా హరిజన్ సాయిలు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి ఇరు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శంకర్, జగదీశ్‌చారి, రామాచారి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర

- మొన్న నీరందక ఎండిన పంట
- నేడు వడగండ్ల వానకు నేలవాలిన వరి
- రూ.కోట్లలో నష్టపోయిన రైతులు



పల్లెగడ్డలో నీరందక ఎండిన వరి పంటను చూపుతున్న రైతు (ఫైల్)

నవాబుపేట: అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర జేసింది. యాసంగిలో మండలంలో సుమారు రూ.3 కోట్లకుపైగా రైతులు పెట్టుబడులు నష్టపోయారు. ఈసారి భూగర్భ జలమట్టం తగ్గినందున పంటల సాగు సైతం తక్కువగానే చేసినా.. ఆ పంటలు కూడా సరిగా పండక నష్టాల పాలయ్యారు. తాజాగా నీరందక 413 ఎకరాల వరి పంట ఎండిపోయింది. ఇదిలా ఉంటే మంగళవారం కురిసిన అకాల వడగండ్ల వర్షానికి 365 ఎకరాల వరి పంట నేలవాలింది. మొత్తంగా 778 ఎకరాల పంటకు నష్టం వాటిల్లడంతో పెట్టుబడి కూడా చేతికందక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది యాసంగిలో సుమారు పది వేల ఎకరాలకుపైగా వరి సాగు కాగా.. ఈసారి 6,894 ఎకరాల్లో వరి వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పెట్టుబడిని దృష్టిలో ఉంచుకొని పంట నష్ట పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



రుద్రారంలో వడగండ్ల వానకు నేల రాలిన వరి

ప్రభుత్వమే ఆదుకోవాలి..



నేను 6 ఎకరాల వరి సాగు చేశా. రెండ్రోజుల్లో పంట ఇంటికి వస్తుందని ఆశించిన తరుణంలోనే వడగండ్ల వర్షం కురవడంతో పంటంతా నేలరాలింది. ప్రభుత్వం స్పందించి నాలాంటి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– రమేష్, రైతు, రుద్రారం

పరిహారం ఎక్కువగా ఇవ్వాలి



రైతులు ఆందోళనతోనే యాసంగి సాగుకు ముందుకొచ్చారు. మొదట్లో సరిగా నీరందక బోర్లు వేశాం. తీరా పంట పండిందని అనుకుంటున్న తరుణంలో వడగండ్ల వర్షం కురిసి పంట నేలవాలి కన్నీరు మిగిలాయి. వరి సాగు ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి అయింది. ప్రభుత్వం పెట్టుబడికి తగ్గట్టుగానే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– రాఘవేందర్, రైతు, కొండాపూర్

ప్రభుత్వానికి నివేదిస్తాం..

మండలంలో మంగళవారం కురిసిన అకాల వడగండ్ల వర్షానికి 365 ఎకరాలకు పైగా పంట నష్టపోయినట్లు తెలిసింది. ఒక్క రుద్రారం గ్రామంలోనే దాదాపుగా 187 ఎకరాల్లో వరి పంట నేలరాలింది. కొండాపూర్, కొల్లూర్, పోమాల్‌లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. – కృష్ణకిషోర్, మండల వ్యవసాయ అధికారి, నవాబుపేట

లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలకు..



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని కలెక్టర్ విజయేందిర అన్నారు. గురువారం రాత్రి స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. 9వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి అందుతున్న బోధన, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ఎలా రాశారు.. వేసవి సెలవుల్లో ఏం చేస్తారు.. ఇంటి దగ్గర తల్లిదండ్రులకు సాయం చేస్తారా? తదితర విషయాలు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ.. పదోతరగతిలో ప్రవేశించనున్నందున చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చదువుతో పాటు లోక జ్ఞానం కూడా తెలుసుకోవాలని.. సమస్యలను ఎలా అధిగమించాలో సమయస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి

జడ్చర్ల: స్థానిక సరస్వతీనగర్‌కాలనీలోని భూ సమస్యను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కాలనీవాసులు గురువారం కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2003లో ఏర్పాటుచేసిన డీటీసీపీ వెంచర్‌లో తామంతా ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, పుర అధికారులు ఇచ్చిన అనుమతితో రోడ్లు, వీధిదీపాలు తదితర మౌలిక సదుపాయాలు కూడా కల్పించారన్నారు. కానీ 2013లో దేవాదాయశాఖ అధికారులు కాలనీ భూమిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిజిస్ట్రేషన్‌శాఖకు లేఖ రాయడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయాయని.. స్వయంగా విచారించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ సతీష్, కాలనీ ఇన్‌చార్జ్ బొక్క రాఘవేందర్, మధు, ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు ధ్వంసం



దేవరకద్ర రూరల్: మండలంలోని వెంకటాయపల్లి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను గురువారం అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. వెంకటాయపల్లి, కోటకదిర శివారులో ఉన్న వాగులో కొంతకాలంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులు వాగులోకి వెళ్లి అక్రమంగా నిల్వ చేసిన 25 ట్రాక్టర్ల ఇసుకను ధ్వంసం చేయడంతో పాటు వ్యవసాయ బోర్లను ఫిల్టర్ చేసేందుకు వినియోగిస్తున్నారని గుర్తించారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్‌ఐ శరత్, అధికారులు పాల్గొన్నారు.

'నీట్' మాక్ టెస్ట్‌కు విశేష స్పందన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన నీట్ మాక్ టెస్ట్‌కు స్పందన లభించింది. ఈ పరీక్షకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కాగా, దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాన్ని సుశ్రుత హాస్పిటల్ చైర్మన్ డా.మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే చక్కటి ప్రణాళిక, కార్యదీక్ష, పట్టుదల అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, అకాడమి ఇన్‌చార్జ్ పావనిరెడ్డి, డైరెక్టర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



భూత్పూర్‌లో విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

భూత్పూర్: పత్తి విత్తన కంపెనీ యజమానులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు హెచ్చరించారు. ఎస్పీ జానకి ఆదేశానుసారం గురువారం మండల కేంద్రంతో పాటు పోతులమడుగులో ఉన్న సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రత్నం, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మా బయోటిక్, సికాప్, సుదివ్య, సాయితేజ, ఆద్యా సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో విత్తన నిల్వలు, విత్తన ప్యాకెట్లతో పాటు రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందించాలని కంపెనీ యజమానులకు సూచించారు. ఏఓ మురళీధర్ ఉన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఫైర్‌స్టేషన్ అధికారి రాజేందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలి.. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తున్నప్పుడు ఎలా ఆర్పాలి, లిఫ్ట్, మెట్లు, విద్యుత్ ఉన్న ప్రాంతాల్లో ఎలా వ్యవహరించాలన్న వాటిపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఆయా ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు అతికించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో డయల్ 101కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ రాఘవేందర్, డీఓపీ వెంకటేశ్, నవీన్‌కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన అవసరమని అగ్నిమాపక అధికారి మల్లికార్జున్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలో ఉన్న భారత్ గ్యాస్ గోదాం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ అంటే భయం అవసరం లేదని, ప్రమాదం జరిగినప్పుడు సమయస్ఫూర్తితో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలన్నారు. గ్యాస్ సిలిండర్ల స్టోరేజీ, భద్రత, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక అగ్నిమాపక పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో అగ్నిమాపకశాఖ ఫోన్‌నంబర్ 101కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ నవీన్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మాట్లాడుతున్న ఎంఈఓ నాగ్యానాయక్

నవాబుపేట: గ్రామస్తుల చొరవతోనే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా కొనసాగుతున్నాయని మండల విద్యాధికారి నాగ్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులిచ్చిన విరాళాలతో సుమారు వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న పాఠశాలలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఇలాంటి కార్యక్రమం ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన దాతలను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సీఆర్పీ జనార్దన్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్, ప్రధానకార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మయ్య, నీలకంఠారెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

జడ్చర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూషన్‌తో కూడిన హెల్త్‌కార్డులు మంజూరు చేయించేందుకు చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా సర్వీస్ రూల్స్ తీసుకొచ్చేందుకు, పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల, పీఆర్సీ అమలుకు కృషి చేస్తామని తెలిపారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టేలా ప్రభుత్వాన్ని కోరుతామని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, సావిత్రి, హలీం, గోపాల్, వెంకటయ్య, రాజేశ్వర్‌రెడ్డి, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రణాళిక తప్పనిసరి



మాట్లాడుతున్న డీడీఎం శణ్ముఖాచారి

అడ్డాకుల: ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రణాళిక తప్పకుండా ఉండాలని నాబార్డు డీడీఎం శణ్ముఖాచారి అన్నారు. గురువారం మూసాపేట మండలం పోల్కంపల్లిలో ఆర్‌బీఐ, సిర్డ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మహిళల ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొదుపుతోనే కుటుంబాలు ఆర్థికంగా బాగుపడతాయని.. బ్యాంకులు అందించే సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండి సైబర్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎల్‌డీఎం భాస్కర్, టీజీబీ మూసాపేట బ్రాంచ్ మేనేజర్ అనందజ్యోతి, ఏపీఎం వెంకటాచారి, పీఏసీఎస్ డైరెక్టర్ సువర్ణ, సిర్డ్ కార్యదర్శి కుర్మయ్య, కో-ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

'రాజకీయ కక్ష సాధింపు సరికాదు'

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు బనాయించి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని సామాజికవేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హనీఫ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను స్వాతంత్ర్య ఉద్యమం కంటే ముందే తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారని గుర్తుచేశారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై దేశ ప్రజల్లో తప్పుడు అభిప్రాయాన్ని కల్పించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. తక్షణమే ఈ తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ డీఎంకు మహిళా ఉద్యోగుల వినతి



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాతకు గురువారం మహిళా కండక్టర్లు సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య అధికం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని, వారంలో రెండు ఓటీఎస్, రెండు స్పెషల్ వీక్లీఆఫ్ విధులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 8 గంటల డ్యూటీ అమలు చేయాలని, రాత్రి 8లోపే విధులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంటీడబ్ల్యూ యాక్ట్ అమలు చేయాలని విన్నవించారు.

బస్‌షెల్టర్ లేని మిడ్జిల్

నిలువ నీడ కరువు

- నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలు
- బస్సుల కోసం ఎండలో పడిగాపులు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



మండల కేంద్రంలో బస్సు కోసం రహదారి పక్కన నిలబడిన ప్రయాణికులు

మిడ్జిల్: మండల కేంద్రం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, మాధారం, కల్వకుర్తి మార్గాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. వారు బస్సుల కోసం వేసవిలో ఎండకు, వానాకాలంలో వర్షానికితడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒకటి చొప్పుడు సుమారు 20 బస్సులు హైదరాబాద్‌కు తిరుగుతుంటాయి. అలాగే మూడు నాలుగు బస్సులు మాధారం మీదుగా కల్వకుర్తికి, పదుల సంఖ్యలో జడ్చర్ల, కల్వకుర్తి రూట్లలో ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంతో పాటు తలకొండపల్లి, వెల్జాల్, మాధారం, గుడిగాన్‌పల్లి, మల్లాపూర్, వేముల, వెలుగొమ్ముల, వాడ్యాల్, దోనూర్, సింగందొడ్డి, మున్ననూర్, రాణిపేట, చిల్వేర్, అయ్యవారిపల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇక్కడికి చేరుకొని వివిధ ప్రాంతాలకు బస్సుల్లో వెళ్తుంటారు. వీరంతా బస్సు వచ్చే వరకు వేచి ఉండేందుకు స్థలంతో పాటు నీడ కూడా లేక అవస్థలు పడుతున్నారు. ఎండ, వానకు తట్టుకోవడం కష్టంగా ఉందని, దుకాణాల ఎదుట నిలబడితే యజమానులు చివాట్లు పెడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.

నీడ కూడా లేదు..



హైదరాబాద్ వెళ్లేందుకు సింగందొడ్డి నుంచి వచ్చా. బస్సు కోసం సుమారు 40 నిమిషాల పాటు ఎండలో నిలబడాల్సి వచ్చింది. నాలా ఎందరో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– శివారెడ్డి, సింగందొడ్డి

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి..



మహబూబ్‌నగర్ వెళ్లేందుకు వేముల నుంచి వచ్చా. బస్సు వచ్చేంత వరకు ఎండలో నిలిచి ఇబ్బంది పడ్డా. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మించాలి.

– గణేష్, వేముల